

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్‌పై మరోసారి బీజేపీ జెండా ఎగురుతుంది

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై మరోసారి బీజేపీ జెండా ఎగురుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఇందిరాభవన్‌లో మాజీ మంత్రి పి.నర్సారెడ్డి సంతాప సభ



పి.నర్సారెడ్డి(ఫైల్)

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీమంత్రి పి.నర్సారెడ్డి సంతాప సభ తెలంగాణ కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు నాంపల్లిలోని గాంధీభవన్‌లోని ఇందిరాభవన్‌లో జరుగుతుందని టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి టి.కుమార్‌రావు, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సిరోహిణ్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాప సభకు తరలిరావాలని కోరారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్న పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ సుచిరితరెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ సుచిరిత రెడ్డి అన్నారు. ఆదివారం రాంనగర్‌లోని హరినగర్‌లో పైడిరాకేష్‌రెడ్డి ఫౌండేషన్, దక్షిణ భారత సేవా సమాజ్, గ్రూప్ ఆఫ్ నైన్‌స్టార్ కంపెనీ, జీజీఛారిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీజీ చారిటి ఫౌండర్ గంగాధర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

పేద, శ్రామిక ప్రజల ఆరాధ్యుడు మఖ్దూం మొహియుద్దీన్

కవాడిగూడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పేద, శ్రామిక ప్రజల ఆరాధ్యుడు, గొప్ప కవి మఖ్దూం మొహియుద్దీన్ అని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ కొనియాడారు. మఖ్దూం మొహియుద్దీన్ 116వ జయంతి సందర్భంగా ఆదివారం ట్యాంక్‌బండ్ మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి వి.ఎస్.బోస్‌తోపాటు సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, పడాల నళిని, అరుట్ల రాజ్‌కుమార్, చెట్టుకింది శ్రీనివాస్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ ఉపాధ్యక్షుడు సి.యాదగిరిపై నాంపల్లి రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద దాడి చేసిన సీఆర్‌పీఎఫ్ పోలీసులపై చర్యలు చేపట్టాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ దాడికి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలిజాల ప్రవీణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా దేవేందర్‌రావు, నాయకుడు పెండ్యాల సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలతో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ నాయకులు యశ్వంత్, మూల రవీందర్‌గౌడ్, నాగరాజు చారి, శ్రీధర్‌గౌడ్, సుధాకర్, సంతోష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.
\- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో త్వరలో మల్టీప్లెక్స్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఐమాక్స్ తరహా మల్టీప్లెక్స్ నిర్మాణం జరిగింది. త్వరలోనే ప్రారంభం కానుంది. తూళ్ళ ఓడియన్ కాంప్లెక్స్ పేరిట మాల్ ఏర్పాటు కానుండడంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌కు పూర్వవైభవం రానుంది. ఈ మాల్‌లో దాదాపు ఎనిమిది మినీ సినిమా థియేటర్‌లతోపాటు షాపింగ్‌కాంప్లెక్స్, గేమ్స్ సెంటర్‌లు ఏర్పాటు అవుతున్నట్లు తెలుస్తోంది.

పదోన్నతుల ప్రక్రియను కొనసాగించాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మధ్యలో ఆగిపోయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను కొనసాగించాలని, టెట్ విషయంలో సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని యూటీ ఎఫ్ రాష్ట్ర నాయకుడు మాణిక్‌రెడ్డి అన్నారు. దోమల్‌గూడలోని సంఘం కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి ఇంద్రజిత్, జిల్లా అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్, జిల్లా కోశాధికారి వినయ్ కుమార్, ఉపాధ్యక్షులు రేణు, నాగరాజు, నరసింహారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, కవిత, విశాలి, పాల్గొన్నారు.



కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శంకరమఠంలో జరుగుతున్న హరికథా మహోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం భాగవతార్ మడమల రాంబాబుచే మహాకవి కాళిదాసు హరికథా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఏపీ పాఠశాల విద్యా నియంత్రణ పర్యవేక్షణ కమిషనర్ జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు, ఏసీబీ తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ లీగల్ అడ్వయిజర్ పి.రమణప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త విష్ణువర్ధన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాగవతార్ మడమలరాంబాబును సత్కరించారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఎడ్యుకేషన్ మెడికల్ హబ్‌గా త్రిపుర రాష్ట్రం

- బాల్య వివాహాలను, డ్రగ్స్ వినియోగాన్ని నిరోధించడానికి చర్యలు
- ఆ రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి
- నారాయణగూడలోని భారత్ కళశాలలో గవర్నర్ దంపతులకు సన్మానం



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని మెమొంటోతో సత్కరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రం త్రిపుర ఎడ్యుకేషన్ మెడికల్ హబ్‌గా ప్రసిద్ధి చెందుతుందని ఆ రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. గిరిజన జాతులు అత్యధికంగా ఉండడం వలన బాల్య వివాహాలు పెరిగిపోతున్నాయని, డగ్స్ వినియోగం కూడా అధికంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండింటినీ నివారించడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారత్ విద్యా సంస్థల చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నారాయణగూడలోని భారత్ కళాశాల ఆడిటోరియంలో త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఎన్.ఇంద్రసేనారెడ్డి, ఆయన సతీమణి రేణుకా ఇంద్రసేనారెడ్డిలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. త్రిపుర రాష్ట్రం చిన్న రాష్ట్రాల్లో దేశంలోనే మూడోదని, ఇక్కడ 19 రకాల గిరిజన జాతులు నివసిస్తున్నారని అన్నారు. గిరిజనులు మాట్లాడే భాషకు లిపిని ఏర్పాటు చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందుకోసం ఉన్నత విద్యావంతులతో ఓ కమిటీని కూడా వేశామని ఆయన తెలిపారు. ప్రస్తుతం త్రిపుర రాష్ట్రంలో 87శాతం అక్షరాస్యత ఉందని, దానిని మరో 3 శాతం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు గవర్నర్ తెలిపారు. ఏ స్థాయికి ఎదిగిన మూలాలను మరచిపోవద్దని హితవుపలికారు. తాను గవర్నర్ స్థాయికి ఎదిగినా చిన్న నాటి స్నేహితులను మరచిపోలేదని, అన్ని విషయాలను చర్చించుకునేదే నిజమైన జీవితం అని ఇంద్రాసేనా రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కు సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని నరేంద్రనగర్ పార్కులో చేపడుతున్న ఆధునీకీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని, ఇప్పటికే పార్కు పనులు 60 శాతం వరకు పూర్తయ్యాయని, మిగతా పనులను త్వరగా పూర్తి చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ఆదివారం నల్లకుంట డివిజన్‌లోని నరేంద్రనగర్ పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ దివ్య, యూబీడీ ఏఈ భాస్కర్, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

త్వరలో బ్యాడ్మింటన్ కోర్టు..

బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సీఈ కాలనీలో నిర్మిస్తున్న ఓపెన్ బ్యాడ్మింటన్ కోర్టు పనులను త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం డివిజన్‌లోని సీఈ కాలనీలో నిర్మిస్తున్న ఓపెన్ బ్యాడ్మింటన్ కోర్టు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీ.హెచ్.చంద్రమోహన్, నాయకులు కరణ్ రావు, సతీష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్‌బాబును సన్మానిస్తున్న సంఘం నేతలు

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతకు సన్మానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శిగా గుండు జగదీశ్‌బాబు నియమితులైన సందర్భంగా చిక్కడపల్లి గంగపుత్ర (బెస్త) సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను సంఘం కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నేతలు పాక రవిప్రసాద్, జి.సురేందర్, వెంకటేష్, రాజ్, పాక జ్ఞానేశ్వరి, సుజాత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్‌కు 20 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించకుండా కొంత మంది వ్యక్తులు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులుగా చలామణి అవుతూ ఇందిరాపార్కు సమస్యలను పట్టించుకోవడం లేదని ఇందిరాపార్కు వాకర్స్ పరిరక్షణ సమితి ప్రతినిధులు అన్నారు. ఆదివారం ఇందిరాపార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భవాని శ్రీనివాస్, వి.రవీందర్‌రెడ్డి, కె.హనుమాన్‌గౌడ్, విజయలక్ష్మి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ఇందిరా పార్కు వాకర్స్ అసోసియేషన్‌కు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

విద్యార్థినుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలి

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని బాలిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కోడి భవ్య (15), గాదె వైష్ణవి (15) అనే ఇద్దరు విద్యార్థినులు హాస్టల్‌లో ఉరేసుకుని శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విచారకరమన్నారు. ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విజయా క్రియేషన్స్ నూతన సాంస్కృతిక సేవా సంస్థ ప్రారంభం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీద్యుతి మ్యూజికల్ అకడమీ, ఇషాస్ ఫౌండేషన్ స్థాపకులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మిలు ఐదు సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు సంగీతపరంగా సినీ పాటల విభావరిలు వేదికలపై నిర్వహించారు. వీరి సారథ్యంలోనే మరో సాంస్కృతిక సేవాసంస్థ విజయ క్రియేషన్స్ ప్రారంభ వేడుకలు ఆదివారం సాయంత్రం త్యాగరాయగాన సభలో జరిగాయి. ముఖ్యఅతిథులుగా ప్రముఖ వీణావాయిద్య నిపుణులు పేరి సీత, బ్రిలియంట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ ఈవో శ్రీరామచంద్రమూరి, ప్రముఖ గాయకుడు త్రినాథరావు పేరి కామేశ్వరరావు, గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొన్నారు.

నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబావుటా ఎగురవేసిందన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని రవీంద్రభారతి మినీహాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను విముక్తి చేసింది నక్సల్స్ ఉద్యమమనే నిజాన్ని సమాజానికి చెప్పాలన్నారు. కరీంనగర్‌తోపాటు మరిన్ని ప్రాంతాల చరిత్ర రాయాల్సిన అవసరముందన్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులను భూస్వాములు వేధించేవారని, కుల వివక్ష తీవ్రంగా ఉండటంతో హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో నక్సల్ ఉద్యమాలు జరిగాయన్నారు. ఆకలితో ఉన్న వారితోపాటు ఆకలిబాధ తెలిసిన ఎంతోమంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలిపేందుకు తెలంగాణ సమాజంలో జరిగిన ఉద్యమాలపై ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వి.ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ ఉద్యమస్ఫూర్తి రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలుగునాట జరిగిన నక్సల్ బరి ఉద్యమంలో ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారన్నారు. మాయని గాయాల నెత్తుటి చరిత్ర వంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. తెలంగాణలో విప్లవం సృష్టించిన ఎంతోమంది మేధావుల గురించి సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సీనియర్ జర్నలిస్ట్, రచయిత జాకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సి.విఠల్, రచయిత డా.తైదల అంజయ్య, తులాయిల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైలులో 1344 మంది అయోధ్యకు ప్రయాణం

- ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ నాయకులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీరాముని దర్శనం కోసం సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని 1344 మంది శ్రీరామ భక్తులు ప్రత్యేక ట్రైన్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి అయోధ్యకు బయల్దేరి వెళ్తారని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో అయోధ్యలోని శ్రీరాముడుని దర్శించుకునేందుకు బయల్దేరే ట్రైన్‌బోగీల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా శ్యామ్‌సుందర్ గౌడ్ హాజరయ్యారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గౌతంరావు, బీజేపీ సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి సీకే శంకర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కుట్టుమిషన్‌లు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, గంజి రాజమౌళి గుప్తా

ముషీరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఇంటర్‌నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వైశ్య ఫెడరేషన్ బృందం కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని వైశ్య భవన్‌లో ఇంటర్‌నేషనల్ వైశ్య ఫెడరేషన్ కల్చరల్ కమిటీ యువజన విభాగం చైర్మన్ ప్రమాణస్వీకారం, 10 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా మాట్లాడుతూ.... త్వరలో దివంగత ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహ ఆవిష్కరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైశ్యఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, రాష్ట్ర యువజన కమిటీ అధ్యక్షుడు కట్ట రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే అంతర్జాతీయ వైశ్యఫెడరేషన్ నూతన కల్చరల్ కమిటీ యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా వందనపు శైలేష్‌గుప్తా, కో చైర్‌పర్సన్‌లు అనురాధ, కృష్ణవేణి, స్వాతి, సుష్మా, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు జీ. శ్రీనివాస్, వీరేశం, భాస్కర్, శివకుమార్, గోవింద్, వెంకట్‌రాజు, అనిల్‌లు బాధ్యతలు చేపట్టారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలి

- మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేసిన ఎంపీ. ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్‌తో కలిసి ఆదివారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామని ఆర్. కృష్ణయ్య తెలిపారు మంత్రిని కలిసిన వారిలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, భరత్, నీల వెంకటేష్, గుజ్జ సత్యం, సి.రాజేందర్, రామకృష్ణ, మట్ట జయంతి, బలరాం, రాకేష్, దత్త, జ్యోతి ఉన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు

రచయితలు విస్తృతమైన రచనలు చేయాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలు, భారతీయత ధర్మానికి ఉన్న విశిష్టతను నేటితరానికి తెలియజేయడానికి రచయితలు విస్తృతమైన రచనలు చేయాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్. కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భాగ్యనగర్ శివాజి సేవాసమితి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ పి.భాస్కర్ యోగి రచించిన సమత్వ సాధనలో సౌజన్యమూర్తులు అనే పుస్తకాన్ని డా.కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. భారత్ విశిష్టతను తెలిపే పుస్తకాలను నేటితరానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఎన్‌సీఈఆర్‌టీ సభ్యులు డాక్టర్ మురళీమనోహర్, ప్రముఖ రచయిత నందనం కృపాకర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు ఆలె భాస్కర్, ఏ.సాయికృష్ణ, పుస్తక రచయిత డాక్టర్ పి.భాస్కర్‌యోగి, సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాణాప్రతాప్ పాల్గొన్నారు.

వివేకానందనగర్ వాసులకు పునరావాసం కల్పించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ వాసులకు పునరావాసం కల్పించాలని బీజేపీ ఎం.పీ. డా. కె. లక్ష్మణ్ అన్నారు. ఇటీవల బస్తీలో 23 పేదదళిత కుటుంబాల ఇళ్ళను కోర్టు ఉత్తర్వుల పేరిట అక్రమంగా కూల్చివేశారని ఆయన ఆరోపించారు. స్థానిక బాధితులు నిర్వహిస్తున్న నిరసనదీక్షకు ఆదివారం ఆయన సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్ సమ్మె విజయవంతం చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న గ్రామీణ బంద్ సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తెలంగాణ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు హేమలత, వెంకట్ రాములు, భాస్కర్, భూపాల్, ప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కొంగ కరుణశ్రీకి నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు సి.రాజేందర్, నీల వెంకటేష్, నిరంజన్, బాలయ్య, నిఖిల్, రేణుక, లావణ్య తదితరులు పాల్గొన్నారు
-రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)

11 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీ శృంగేరి జగద్గురు మహాసంస్థానము శ్రీ పంచముఖ ఆంజనేయ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 15 వరకు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మాధికారి కళా జనార్దనమూర్తి, సీఈవో, అడ్మినిస్ట్రేటర్ గౌరీశంకర్ తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యమిత్రల సంఘం నేతలు

ఆరోగ్యమిత్ర ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమిత్ర ఉద్యోగులకు కనీస వేతనాలు అందించకపోడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యమిత్రల సంఘం గౌరవ అధ్యక్షుడు భూపాల్, అధ్యక్షుడు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు అనుబంధ) ఆరోగ్యమిత్రల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని, కనీస వేతనం రూ. 35 వేలతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీసీ నియామకాలలో మాదిగలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న బంధు సొసైటీ అధ్యక్షుడు పి.వీరస్వామి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో భర్తీ చేయనున్న రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్ పోస్టులలో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలని బంధు సొసైటీ డిమాండ్ చేసింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బంధు సొసైటీ అధ్యక్షుడు పి.వీరస్వామి, దళిత క్రిస్టియన్ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ వి.నతానియేలు మాట్లాడారు. ఈ సమావేశంలో బహుజన రాజ్యాధికార సమితి ప్రతినిధి దేశపాక నర్సింగ్, సోషల్ జస్టిస్ ఫోరం ప్రతినిధి గ్యార శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని సోమవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. వైఎంసిఏ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 నుంచి 12.30 వరకు, బసంత్‌కాలనీలో మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు, ఫీవర్‌ఆస్పత్రి పరిధిలో 3.30 నుంచి 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. గోల్నాక, బ్యాంక్ ఆఫ్ బరోడా పరిధిలో 10 నుంచి 1 వరకు, సిటీసెంట్రల్ లైబ్రరీ, దోమలగూడ పరిధిలో 2 నుంచి 5 వరకు సరఫరా ఉండదని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ అన్నారు.